# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 31-08-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- దేశ వస్త్ర రంగం కోట్లాది మందికి జీవనోపాధిని అందిస్తోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.
- ఎస్సీవో శిఖరాగ్ర సమావేశాన్ని పురస్కరించుకొని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పలువురు దేశాధినేతలతో బిష్కెక్ నగరంలో ఈరోజు సమావేశమయ్యారు.
- సెమీకాన్ 2.0 పథకంతో రానున్న పదేళ్ల కాలంలో లక్ష మంది సెమీకండక్టర్ ఇంజినీర్లను తయారు చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.
- విశాఖపట్నంలోని హిందుస్తాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ నిర్మించిన `ఐఎన్ఎస్ నిపుణ్` భారత నౌకాదళంలోకి ఈరోజు జలప్రవేశం చేసింది.

=============================

దేశ వస్త్ర రంగం కోట్లాది మందికి జీవనోపాధిని అందిస్తోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ NIFT స్నాతకోత్సవ కార్యక్రమంలో రాష్ట్రపతి ఈరోజు పాల్గొని ప్రసంగించారు. దేశం సాంస్కృతిక వారసత్వం, విలువలకు అనుసంధానమై ఉంటూనే విద్యార్థులు ప్రపంచ దృక్పథాన్ని అలవర్చుకోవాలని ద్రౌపది ముర్ము ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఫ్యాషన్ పరిశ్రమలో మహిళల పాత్ర క్రమంగా పెరుగుతోందని పేర్కొన్న రాష్ట్రపతి.. కార్యక్రమానికి హాజరైన దాదాపు 4 వేల మంది విద్యార్థుల్లో సుమారు 85 శాతం మంది మహిళలే అన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ సాధించాలన్న లక్ష్యానికి యువత తమ వంతు సహకారం అందించాలని కోరారు. విద్యార్థులు కేవలం ఉద్యోగాల కోసం వెతికే వారిగా కాకుండా.. ఇతరులకు ఉద్యోగ అవకాశాలను కల్పించే ఉద్యోగదాతలుగా ఎదగాలని రాష్ట్రపతి సూచిస్తూ…

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

షాంఘై సహకార సంస్థ (SCO) శిఖరాగ్ర సమావేశాన్ని పురస్కరించుకొని కిర్గిస్తాన్ లో పర్యటిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆ దేశ రాజధాని బిష్కెక్ నగరంలో ఈరోజు పలువురు దేశాధినేతలతో సమావేశమయ్యారు. ఇందులో భాగంగా ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ తో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించి... పశ్చిమాసియా సంఘర్షణలపై ఆందోళన వ్యక్తం చేశారు. చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే సమస్యలను పరిష్కరించుకోవాలని పునరుద్ఘాటించారు. వాణిజ్య నౌకలు, పౌరులకు ఎలాంటి హాని కలగకుండా స్వేచ్ఛా నౌకాయానాన్ని కాపాడాలన్నారు. అనంతరం... కిర్గిజ్ రిపబ్లిక్ అధ్యక్షుడు సదిర్ జపరోవ్ తో సమావేశమై ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవడంపై చర్చించారు. ఆర్థిక, వాణిజ్య సంబంధాలను పెంపొందించుకోవడంతో పాటు సాంస్కృతిక సహకారం ద్వారా ప్రజా సంబంధాలను మెరుగుపరచడానికి ఒక ఒప్పందాన్ని కూడా కుదుర్చుకున్నారు. అంతకుముందు, ఆర్మేనియా ప్రధానమంత్రి నికోల్ పాషిన్యాన్తోనూ నరేంద్ర మోదీ సమావేశమయ్యారు. రక్షణ, ఫార్మా, సైన్స్ అండ్ టెక్నాలజీ, విద్య, సాంస్కృతిక రంగాలలో పరస్పర సహకారాన్ని పెంచుకోవడంపై ఇరువురు నేతలు చర్చించారు. ఇక రేపు జరగబోయే 26వ SCO శిఖరాగ్ర సమావేశంలో ప్రధానమంత్రి పాల్గొంటారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్తోనూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు బిష్కెక్లో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. జాతీయ ప్రయోజనాలకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వడం ఇరు దేశాల ఉమ్మడి విధానంగా ఉందని ప్రధానమంత్రి ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. భవిష్యత్లోనూ ఇదే విధానం ఇరు దేశాలకు మార్గదర్శక సూత్రంగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఉక్రెయిన్ అంశంపై భారత్, రష్యా దేశాలు నిరంతరం చర్చలు జరుపుతున్నాయని తెలిపారు. శాంతి కోసం జరుగుతున్న అన్ని ప్రయత్నాలకు భారత్ మద్దతు ఇస్తోందని, ఇకపై కూడా అదే వైఖరిని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. యుద్ధంలో గడిచే ప్రతి రోజు మానవాళిని మరింత వెనక్కి నెడుతుందని, అదే సమయంలో శాంతి దిశగా వేసే ప్రతి అడుగు మానవాళిలో కొత్త ఆశలు, ఉత్సాహాన్ని నింపుతుందని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఐఎన్ఎస్ నిపుణ్ భారత నౌకాదళంలోకి ప్రవేశించింది. ముంబైలోని నేవల్ డాక్యార్డ్లో ఈరోజు జరిగిన ఒక కార్యక్రమంలో నిస్తార్ తరగతికి చెందిన రెండవ డైవింగ్ సపోర్ట్ వెసెల్ `ఐఎన్ఎస్ నిపుణ్` జల ప్రవేశం చేసింది. ఈ కార్యక్రమంలో నౌకాదళ అధిపతి అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్ మాట్లాడుతూ... వ్యూహాత్మకంగా కీలకమైన మార్పులు చోటు చేసుకుంటున్న ప్రస్తుత పరిస్థితుల్లో, సముద్రంలో బహుళ రంగాల్లో కార్యకలాపాలను నిర్వహించేందుకు అవసరమైన నౌకాదళ ప్రత్యేక నీటి అడుగు సామర్థ్యాలకు ఐఎన్ఎస్ నిపుణ్ మరింత బలాన్ని చేకూరుస్తుందన్నారు. విశాఖపట్నంలోని హిందుస్తాన్ షిప్యార్డ్ లిమిటెడ్ స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించి నిర్మించిన ఐఎన్ఎస్ నిపుణ్ లో ఆధునిక డైవింగ్ వ్యవస్థలు, నీటి అడుగు ప్రాంతాల్లో కార్యకలాపాలు నిర్వహించేందుకు అవసరమైన సాంకేతిక సామర్థ్యాలు ఉన్నాయి. సముద్రంలో క్లిష్ట పరిస్థితుల్లో పనిచేసే డైవర్లకు నిరంతర సహాయాన్ని అందించే విధంగా ఈ నౌకను రూపొందించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో చిప్ తయారీ ఎకో సిస్టమ్ ను మరింత బలోపేతం చేసేందుకు లక్షా 27 వేల కోట్ల రూపాయల వ్యయంతో సెమీకాన్ 2.0 పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ఈరోజు ప్రకటించింది. ఈ పథకం ద్వారా రానున్న సంవత్సరాల్లో ప్రపంచ సెమీకండక్టర్ పరిశ్రమ మార్కెట్లో భారత్ దాదాపు 10 శాతం వాటాను సాధించే అవకాశం ఉందని, అంతర్జాతీయ సెమీకండక్టర్ విలువ గొలుసులో భారత్ కీలక పాత్ర పోషించనుందని ప్రభుత్వం తెలిపింది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ విషయాన్ని న్యూఢిల్లీలో ఈరోజు పాత్రికేయులకు వెల్లడించారు. నాలుగేళ్లలో 85 వేల మంది సెమీకండక్టర్ ఇంజినీర్లను తయారు చేయాలన్న లక్ష్యాన్ని భారత్ ఇప్పటికే సాధించిందని తెలిపారు. ఈ లక్ష్యం పదేళ్ల కాలానికి

నిర్దేశించినదని, ఇప్పుడు మరో లక్ష మంది ఇంజినీర్లను తయారు చేయాలని కొత్త లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని కేంద్రమంత్రి వివరిస్తూ…

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

స్వచ్ఛతా పఖ్వాడా-2026ను కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డా రేపు ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ఎరువుల శాఖ అధికారులు, సిబ్బందితో కలిసి ఆయన స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించనున్నారు. రెండు వారాల పాటు కొనసాగనున్న ఈ ప్రచార కార్యక్రమం సెప్టెంబర్ 15వ తేదీ వరకు జరగనుంది. ఒకసారి మాత్రమే ఉపయోగించే ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని పూర్తిగా తొలగించడం, వాటి స్థానంలో వస్త్ర సంచులు, పునర్వినియోగించగల సీసాలను ఉపయోగించడంపై ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజల్లో అవగాహన కల్పించనున్నారు. స్వచ్ఛతా పఖ్వాడాలో పరిశుభ్రతకు సంబంధించిన పలు కార్యక్రమాలను నిర్వహించి, స్వచ్ఛతపై ప్రజల్లో అవగాహనను మరింత పెంచేందుకు చర్యలు చేపట్టనున్నట్లు కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖ తెలియజేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో భారత్ 7.8 శాతం జీడీపీ వృద్ధి సాధించడం ఒక అద్భుతమైన విజయమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభివర్ణించారు. చమురు ధరల పెరుగుదల, సరఫరా వ్యవస్థల్లో అంతరాయాలు, ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు ఉన్నప్పటికీ.. ఈ వృద్ధి సాధించడం దేశ ప్రజల సమిష్టి శక్తి, పట్టుదలకు నిదర్శనమని సామాజిక మాధ్యమ పోస్ట్ లో పేర్కొన్నారు. ఇక దేశ ఆర్థిక వ్యవస్థ బలమైన పనితీరుకు ప్రజల కృషే ప్రధాన కారణమని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఎన్డీయే ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు, ఆర్థిక వ్యవస్థను చురుగ్గా నిర్వహిస్తున్న విధానం మంచి ఫలితాలను ఇస్తున్నాయని తెలిపారు. దేశంలోని ప్రతి పౌరుడికి మరిన్ని ఆర్థిక అవకాశాలను విస్తరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆర్థిక మంత్రి స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రిటైల్ విక్రయాల్లో యాసిడ్‌ను పూర్తిగా నిషేధించాలా లేదా మరింత కఠినమైన నిబంధనలతో నియంత్రించాలా అనే అంశంపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని సుప్రీంకోర్టు ఈరోజు ఆదేశించింది. 2013లో యాసిడ్ రిటైల్ విక్రయాలను నియంత్రించేందుకు మార్గదర్శకాలు జారీ చేసినప్పటికీ, యాసిడ్ సులభంగా అందుబాటులో ఉండటంపై ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో కోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. యాసిడ్ దాడుల బాధితుల కోసం తగిన పునరావాస చర్యలను ఆరు వారాల్లోగా రూపొందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సుప్రీంకోర్టు ఆదేశించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =